క్లుప్తంగా

మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సమీక్ష సమావేశం చైర్మన్ బానోతు రాంబాబు అధ్యక్షతన శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో జరిగింది. ఏడాది కాలంగా కమిటీ చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించారు. వచ్చే ఏడాది మార్కెట్‌కు అత్యధికంగా ఆదాయం వచ్చేలా అటు పాలకవర్గం సహకారంతో ఉద్యోగులు కృషి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుచిత్ర, నరేష్‌కుమార్, సిబ్బంది, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమ్మె వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 15 నుంచి సింగరేణిలో సులభ్ కాంప్లెక్స్ కాంట్రాక్ట్ కార్మికులు తలపెట్టిన సమ్మెను వాయిదా వేసినట్లు సులభ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బ్రహ్మానందం తెలిపారు. శుక్రవారం సులభ్ కాంప్లెక్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై హైదరాబాద్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏఎల్‌సీ) సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ విషయమై ఈనెల 16న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అధికారులు, వివిధ యూనియన్ నాయకులతో చర్చలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో 15న తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు ఎండీ రాసుద్దీన్, ఏ.వెంకన్న, రీజియన్ కార్యదర్శి పి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ ప్లాంట్ నిర్మించండి..

పాల్వంచ: పాల్వంచలో మూసివేసిన పాత విద్యుత్ ప్లాంట్ స్థానంలో మరో ప్లాంట్ నిర్మించాలని నూతన విద్యుత్ ఉత్పాదక కేంద్రం సాధన సమితి నాయకులు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో రిటైర్డ్ ఫోర్‌మెన్, కార్మిక సంఘం సీనియర్ నాయకులు జమ్ముల సీతారావిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. పాల్వంచలో మరో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అన్ని వనరులు ఉన్నట్లు చెప్పారు. కిన్నెరసాని నీరు, సింగరేణి బొగ్గు గనులు, రైల్వేలైన్లు ఉన్నాయన్నారు. మరో కర్మాగారాన్ని నిర్మించి పాల్వంచకు పూర్వవైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక, ఇంజనీర్స్ అసోసియేషన్ల నాయకులు బ్రహ్మాజీ, యాసీం, మంగీలాల్, గిరిధర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంకులను అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళలను వేధిస్తున్న ప్రైవేట్ బ్యాంకుల ఆగడాలను అరికట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. బాధిత మహిళలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామవరంలో మహిళలకు వారాల లోన్లను ఇస్తూ బంధన్, అన్నపూర్ణ, బీఆర్‌ఎల్, తిరుమల బ్యాంకులవారు లోన్లు వసూలు చేసే సమయంలో దుర్భాషలాడుతూ, వీడియోలు తీస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముందుగానే ఇన్సూరెన్స్ రూ.3వేలు, కమీషన్ రూ.2వేలు వసూలు చేస్తున్నారని ప్రభుత్వం, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, కనుకుంట్ల శ్రీనివాస్, సనప వీరభద్రం, దారా లక్ష్మి, అన్నపూర్ణ, సుభద్ర, సుగుణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలగానే మినీ ట్యాంక్ బండ్

- చింతలచెరువు అభివృద్ధిపై శీతకన్ను
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- తొమ్మిదేళ్లుగా అందని ద్రాక్షగానే ఆహ్లాదం



విద్యానగర్‌లోని చింతల చెరువు

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణానికి సమీపంలో చింతల చెరువుపై మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు తొమ్మిదేళ్లుగా కలగానే మిగిలిపోయింది. ప్రజలకు ఆహ్లాదం అందించాలనే సంకల్పంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక మినీ ట్యాంక్ బండ్‌ను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కొత్తగూడెం జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న విద్యానగర్ కాలనీలోని చింతల చెరువును అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వం 2016లో రూ.2.50 కోట్ల నిధులు కేటాయించింది. పనులకు శ్రీకారం చుట్టారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించిన అధికారులు, సదరు కాంట్రాక్టరు 40 శాతం వరకు పనులను పూర్తి చేసి ఆ తరువాత వదిలేశారు. చెరువు కట్టపై టైల్స్, వాకింగ్ ట్రాక్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చెరువుపై విద్యుదీకరణ పనులు అసలు ప్రారంభించనే లేదు. తొమ్మిదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో ఇప్పటికే పూర్తి చేసిన పనులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. చింతలచెరువు బాగోగులను పట్టించుకోకపోవడంతో చెరువు పరివాహక ప్రాంతం కబ్జాకు గురవుతోంది. 14 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు ప్రస్తుతం తొమ్మిది ఎకరాలకు చేరుకుంది. చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న కొందరు చెరువు స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

స్థానికులకు అందని ఆహ్లాదం..

చుంచుపల్లి మండలంలో పాత చుంచుపల్లి గ్రామ పంచాయతీ ఉండేది. దాని పరిధిలో ఏడు గ్రామ పంచాయతీలు 2019 వరకు కొనసాగాయి. ఉమ్మడి చుంచుపల్లి గ్రామ పంచాయతీలో 9,236 కుటుంబాలు నివాసముండేవి. వాటి పరిధిలో 25,273 మంది జనాభా ఉండేవారు. చుంచుపల్లిలో అన్ని వనరులను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం చింతలచెరువుపై మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి ముందుకొచ్చింది. గ్రామ పంచాయతీల విభజనతో ప్రస్తుతం ఈ చెరువు విద్యానగర్ కాలనీ పంచాయతీ పరిధిలోకి వచ్చింది. అంతేకాకుండా ఈ ప్రాంతం పరిధిలో కొనసాగుతున్న ఏడు పంచాయతీలూ జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంతో అనుసంధానమై ఉంటాయి. ప్రస్తుతం బాబూ క్యాంపు, ఎన్‌కే నగర్, విద్యానగర్ కాలనీ, రామాంజనేయ కాలనీ, చుంచుపల్లి తండా, నందాతండా, వెంకటేశ్వర కాలనీ గ్రామపంచాయతీల ప్రజలకు ఈ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం వల్ల కొంత ప్రయోజనం చేకూరుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా



వాకింగ్ ట్రాక్‌పై ధ్వంసమైన టైల్స్

చింతలచెరువును సుందరీకరిస్తే ఏడు పంచాయతీల ప్రజలతో పాటు కొత్తగూడెం పట్టణవాసులకు కూడా ఆహ్లాదం దొరుకుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చింతల చెరువు అభివృద్ధిపై దృష్టి పెట్టి మినీ ట్యాంక్ బండ్‌ను అందుబాటులోకి స్థానికులు కోరుతున్నారు.

చెరువును అభివృద్ధి చేయాలి...



చింతల చెరువుపై మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. హడావుడిగా పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. అంతేకాకుండా చెరువు ఆక్రమణకు గురవుతోంది. రెవెన్యూ అధికారులు స్పందించి చెరువును రక్షించాలి.

– బలగం శ్రీధర్, బీజేపీ మండల అధ్యక్షుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా...



చింతలచెరువుకు ప్రాముఖ్యత ఉంది. దానిపై ప్రభుత్వం మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయడానికి అప్పట్లో ముందుకొచ్చింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఓ, విద్యానగర్ కాలనీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఆయన బర్లగూడెం పంచాయతీలో పర్యటించారు. బర్లగూడెం నుంచి మొట్లగూడెం వరకు రూ.10.98 లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్ ఏఈ అన్నె నవీన్, బోడు ఎస్.ఐ శ్రీకాంత్, కార్యదర్శి రమాదేవి, మోహన్‌రావు, క్రాంతి, ప్రవీణ్, అంజి, శేఖర్, రాములు, జగపతి, కిషోర్, ఆరేళ్ల కుమార్, రమేష్, రావూరి సతీష్, రేఖా శివాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఫీజులతో విద్యార్థులకు విద్య...

పట్టణంలోని 14 నంబర్ బస్తీలో మార్గదర్శిని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. శుక్రవారం స్కూల్ నూతన భవనం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత పేదలకు తక్కువ ఫీజులతో విద్యను అందించటం అభినందనీయం అన్నారు. డైరెక్టర్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, యాదగిరి రాంబాబు, కె.బ్రహ్మం, డి.నాగేంద్రబాబు, కృష్ణార్జునరావు, తుమ్మలపల్లి ప్రసాద్, వెంకటస్వామి, డాక్టర్ కేఎస్‌వీ సుధాకర్, బానోతు రాంబాబు, మండల రాము, మడుగు సాంబమూర్తి, బోల్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, అంకెపాక నవీన్, ఎర్ర ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాల్వంచ: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ రెహమిల్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ, సీతారాంపట్నం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు మార్కెట్ ఏరియా, గాంధీనగర్, కరకవాగు, టీచర్స్ కాలనీ, సీతారాంపట్నం, పాత పాల్వంచ, నవభారత్, పాలకోయతండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

పాల్వంచరూరల్: మండలంలోని 33/11కేవీ యానంబైల్ ఫీడర్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కిన్నెరసాని సబ్‌స్టేషన్ పరిధిలోని కిన్నెరసాని, పునుకుల, పుల్లాయిగూడెం, కోడిపుంజులవాగు, రెడ్డిగూడెం, ఉలవనూరు, బంజర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

టేకులపల్లి: టేకులపల్లి, బొమ్మనపల్లి 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు హట్కర్ దేవా, పిండిపోలు బుజ్జి కన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామ సమాఖ్య పదాధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న సీఆర్పీ రజిత

జూలూరుపాడు: స్థానిక ఉషోదయ మండల సమాఖ్య కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సమాఖ్య పదాధికారుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ఈ కార్యక్రమానికి సెర్ప్ స్టేట్ ప్రాజెక్ట్ సీఆర్పీలు రజిత, దయావతి హాజరయ్యారు. గ్రామ సమాఖ్యల నాయకత్వ మార్పిడిలో భాగంగా ఇటీవల కొత్తగా గ్రామ సమాఖ్య పదాధికారులుగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు వారి విధులు, బాధ్యతలు, నిర్వహణపై సీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగియనున్నది. కార్యక్రమంలో ఐబీ ఏపీఎం సుభాష్ చంద్రబోస్, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, సీసీలు బండ్ల మధుసూధన్‌రావు, పి.రామారావు, డి.నాగేశ్వరరావు, బాయమ్మ పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు అండగా ఉంటాం..

జూలూరుపాడు: కార్మిక, కర్షక, బలహీనవర్గాలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం జూలూరుపాడు ఏపీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామశాఖల సంయుక్త మహాసభ జరిగింది. సీనియర్ నాయకుడు సిరిపురపు వెంకటేశ్వర్లుతో కలిసి జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. సీపీఐ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యలపై పోరాడుతోందని, నూరేళ్ల పార్టీగా జనం గుండెల్లో మహోన్నత స్థానం సంపాదించుకుందన్నారు. అనంతరం జూలూరుపాడు గ్రామశాఖ అధ్యక్షుడిగా అనుమల్ల అశోక్, సహాయ కార్యదర్శిగా బరగడ రమేష్, 20 మంది గ్రామ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. అదే విధంగా వెంగన్నపాలెం గ్రామశాఖ అధ్యక్షుడిగా కిలారి ముత్యాలు, సహాయ కార్యదర్శిగా చల్లగొండ్ల సతీష్, 15 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, గుండెపిన్ని మధుసూదన్‌రావు, చెరుకుమల్ల రాజేశ్వరరావు, కంచర్ల రాఘవేంద్రరావు, అనుమల్ల అశోక్, తాతా నరసింహారావు, యల్లంకి శ్రీను, చల్లగండ్ల సతీష్, తాళ్లూరి లక్ష్మయ్య, యలబాక రాంబాబు, కత్తి గోపి, బడుగు వీరస్వామి, పత్తిపాటి మహేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో పలువురు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఎన్నికల సమయంలో ఉద్యమకారుల గౌరవాన్ని ఇనుమడింపజేస్తామని, వారి సంక్షేమం కోసం తోడ్పడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అమరవీరుల కుటుంబాలకు పెన్షన్ ఇవ్వాలని, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మల్లెల రామనాథం, నబీసాహెబ్, దేవాదానం, కుడికాల ఆంజనేయులు, హుస్సేన్, నాగిరెడ్డి ఉన్నారు.

పీఎస్‌గా మారిన యూపీఎస్



విద్యార్థులకు పాఠం చెబుతున్న టీచర్

పాల్వంచరూరల్: సోములగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులు, ఉపాధ్యాయుల ఉన్నా విద్యార్థులు రాకపోవడంతో రెండేళ్లుగా ఐదో తరగతి వరకే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు 29 మంది విద్యార్థులు ఉండగా.. ముగ్గురు ఉపాధ్యాయులకు ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌పై మరో స్కూల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలగా మారింది. సోములగూడెం గ్రామం పాల్వంచకు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో గ్రామంలోని 6, 7వ తరగతుల విద్యార్థులు పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ, గురుకుల, హాస్టళ్లకు వెళ్తుండడంతో స్థానిక స్కూల్లో చేరడం లేదు. తక్కువ విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఇతర స్కూల్స్‌లో విలీనం చేసే అవకాశం ఉందా.. అని ఎంఈఓను వివరణ కోరగా.. ప్రస్తుతానికి అలాంటిది ఏమీ లేదని, న్యూ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.

సింగరేణి మహిళా కళాశాలలో నూతన కోర్సులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి మూడు నూతన కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ నూతన కోర్సులు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల, కార్మికుల, స్థానిక విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఎంఈఓ ప్రభుదయాళ్ తనిఖీలు చేశారు. టూ ఇన్‌క్లైన్, నేతాజీ, కూలీలైన్, మేదరబస్తీ పాఠశాలలను సందర్శించి అడ్మిషన్, అక్షరాభ్యాస, బడిబాట కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు.

శానిటేషన్ పర్యవేక్షణ..

ఇల్లెందు: రెండు నెలల సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. దీంతో పాఠశాలలు చెత్తచెదారంతో నిండిపోయాయి. ఈ క్రమంలో జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. శుక్రవారం జేబీఎస్, మెయిన్‌రోడ్ హైస్కూల్, మామిడిచెట్ల బడి, చింతచెట్ల బడి, గర్ల్స్ హైస్కూల్‌లో మున్సిపల్ కార్మికులు చెత్తను తొలగించారు. శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షించారు.

సింగరేణి స్థలంలో వాగ్వాదం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని రైతు బజార్ వద్ద శుక్రవారం స్థల వివాదంలో గొడవ జరిగింది. సింగరేణి స్థలంలో అనుమతులు లేకుండా కూరగాయల వ్యాపారస్తులు పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న సింగరేణి సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. ఇది సింగరేణి స్థలం అని బోర్డు పెట్టారు. దీంతో వ్యాపారస్తులు సింగరేణి ఎస్టేట్స్, సెక్యూరిటీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయమై తాము ఎమ్మెల్యేతో మాట్లాడతామని రెండు రోజులు అవకాశం కావాలని వ్యాపారస్తులు అధికారులకు కోరారు. రెండు రోజుల్లో స్థలం విషయంలో సరైన పత్రాలు చూయించాలని లేదంటే పెన్సింగ్ వేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ అండ్ పీసీ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య.. పౌష్టికాహారం



ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులతో టీచర్లు

ఇల్లెందురూరల్: ఆటపాటలో విద్య, ప్రతీరోజు పౌష్టికాహారం అంగన్‌వాడీ పాఠశాలల ప్రత్యేకతను వివరిస్తూ మండలంలోని విజయలక్ష్మీనగర్, తిలక్ నగర్ గ్రామపంచాయతీలలో అంగన్‌వాడీ పాఠశాలల టీచర్లు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామపంచాయతీలలో రెండేళ్లలోపు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాల వివరించి సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యార్థుల నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కారం పద్మ, అంజలీమేరి, జి.పద్మ, శ్రీలత, సుమతి, కృష్ణవేణి, ఉమ పాల్గొన్నారు.

టేకులపల్లి: అమ్మమాట .. అంగన్‌వాడీ బాట వేడుకలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం టేకులపల్లి, బోడు, సులానగర్, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్లలో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ఆరోగ్య విద్య, ప్రీస్కూల్ ప్రణాళిక గురించి తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డించారు. సూపర్‌వైజర్లు అనురాధ, ఖలీదా, లక్ష్మి, యశోదమ్మ, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు హెచ్‌ఎం సంపూర్ణ జ్యోతి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో బానోత్ నవీన్ రాథోడ్, కొదుమూరి కోటేశ్వరరావు, ధర్మరాజుల వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనులు ప్రమాదకరం.. ప్రాణాలు గాలిలో దీపం

- పంచాయతీ కార్మికులపై వీడని చిన్నచూపు
- అభద్రత నడుమే విధి నిర్వహణ



ట్రాక్టర్‌తో చెత్త సేకరిస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: ఎంత చిన్న ఉద్యోగైనా తాను చేసే పనిలో దురదృష్టం వెంటాడితే తనను నమ్ముకున్న కుటుంబాన్ని యాజమాన్యం/ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా కలిగి ఉంటాడు. కానీ ప్రభుత్వ ఆధీనంలోని గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ పేరుతో విధులు కొనసాగుతున్న కార్మికులకు ఆ అవకాశం లేదు. విధి నిర్వహణలో మృతి చెందినా, గాయపడినా కార్మికుల కుటుంబాలకు భరోసాతో కూడిన సహాయం అందడంలేదు.

ప్రమాదం, అనారోగ్యంతో.. మృతి

గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్ పేరుతో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అనారోగ్యానికి గురై కొందరు.. ప్రమాదాలకు గురై మరికొందరు మృతి చెందుతున్నారు. ఇల్లెందు సబ్‌డివిజన్ పరిధిలో గుండాల మండలం ముత్తాపురం, సాయినపల్లి గ్రామాలలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో పూనెం బుచ్చయ్య, పూనెం వసంతరావు, బొమ్మెర రామ్మూర్తి, విద్యుదాఘాతానికి గురై టేకులపల్లి మండలంలో వెంకటేష్ మృతి చెందారు. ముప్పై ఏళ్లుగా పోలారంలో గుమస్తాగా, మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహించిన జటంగి వెంకన్న 2025 జనవరి 17న బ్రెయిన్‌స్ట్రోక్‌తో, ఒడ్డుగూడెం గ్రామంలో మధ్యాహ్నం వరకు పనులు చేసి ఇంటికి చేరుకుని గుండెపోటుతో మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం లచ్చగూడెం గ్రామంలో వీధి దీపాలు సరిచేస్తూ స్తంభం మీద నుంచి జారిపడి కార్మికుడు గంద్రాతి సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఒడ్డుగూడెం గ్రామంలో ఇంకుడు గుంతల పనులకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై కార్మికులు చింతల రేణుక, మూతి చుక్కమ్మ గాయపడ్డారు. ఇలా మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కానీ గాయపడిన వారికి గానీ.. అటు ప్రభుత్వం, ఇటు గ్రామపంచాయతీ ఏ రూపంలోనూ ఆదుకోవడం లేదు.

శిక్షణ, లైసెన్స్ లేకుండానే..


సాధారణంగా ఎంతటి సాంకేతిక నైపుణ్యమున్నా విధుల్లో చేరిన వారికి ఎంతోకొంత శిక్షణ ఇప్పించి బాధ్యతలు అప్పగించడం ప్రభుత్వ విభాగాలలో మనం చూస్తుంటాం. కానీ మల్టీపర్పస్ పేరుతో విధుల్లో చేరిన కార్మికులకు ఎటువంటి నైపుణ్య శిక్షణ లేకుండానే ప్రమాకర పనులను అప్పగిస్తున్నారు. లైసెన్స్ లేకుండానే కార్మికులతో ట్రాక్టర్‌లు నడిపిస్తున్నారు. మండలంలోనే 29 గ్రామపంచాయతీల పరిధిలో 14 మంది ట్రాక్టర్ డ్రైవర్లు లైసెన్స్ లేకుండా విధుల్లో కొనసాగుతున్నారు. ఇక ఎలక్ట్రీషియన్‌గా కనీస శిక్షణ పొందిన వారు ఒక్కరూ లేరు. ఆయా విధులలో వయస్సు పైబడిన వారికి కూడా అవకాశం కల్పించడం గమనార్హం. ఇదిలా ఉండగా ఎటువంటి రక్షణ చర్యలు లేకుండానే పారిశుద్ధ్యం పనులు చేస్తూ అనారోగ్యం బారిన పడిన కార్మికుల పరిస్థితి మరీ దయనీయం.

మాటలకే పరిమితమైన బీమా..

గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు 2023లో నెల రోజులు సమ్మె చేపట్టారు.

అప్పటి ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు సంఘీభావం ప్రకటించి డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే అదే సమయంలో మేల్కొన్న అప్పటి పాలకపక్షం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ప్రతీ కార్మికునికి రూ.5లక్షలు ఇన్సూరెన్స్ తక్షణమే చేయిస్తామని ప్రకటన విడుదల చేసింది. కానీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా పలు కారణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి దుర్భర జీవితాలను అనుభవిస్తున్నాయి.


బీమా సౌకర్యం కల్పించాలి..



పంచాయతీలలో మల్టీపర్పస్ పద్ధతిని రద్దు చేయాలి. ప్రతీ కార్మికుడికి గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5లక్షల మేర ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి.

– మోహన్‌రావు, పంచాయతీ కార్మికుడు, రేపల్లెవాడ

నైపుణ్య శిక్షణ ఇప్పించండి..



మల్టీపర్పస్ పేరుతో కార్మికులతో అన్ని పనులు చేయించడం అన్యాయం. సాంకేతికపరమైన పనుల విషయంలో విధులు నిర్వహించే కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలి. విధి నిర్వహణలో గాయపడిన కార్మికుల వైద్య ఖర్చును గ్రామ పంచాయతీలే భరించాలి.

– కిరణ్, పంచాయతీ కార్మికుడు, విజయలక్ష్మీనగర్

విద్యాసంస్థల్లో దోమల నివారణ చర్యలు

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలో మలేరియా దోమల నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎంజేపీ బీసీ బాలుర గురుకులం, కేజీబీవీ, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, పీఎం బాలుర హాస్టల్, ఏకలవ్య స్కూల్, కోయగూడెం, గంగారం ఆశ్రమ పాఠశాలలు, సిద్ధారం, మొట్లగూడెం నాగారపు జోగుగుత్తికోయల గ్రామాలలో మలేరియా నివారణకు తీసుకునే ముందస్తు చర్యలలో భాగంగా దోమలమందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సత్యం, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది స్వప్న, సులోచన, మానస తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు గిఫ్ట్‌లు ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): సీఈఆర్ క్లబ్‌లో కమిటీలు ఏర్పాటు చేసి కార్మికులకు గిఫ్ట్‌లు అందజేయాలని ఏరియా జీఎం శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. శుక్రవారం జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడి నుంచి రూ.10 కలెక్ట్ చేసి, కమిటీ ద్వారా కార్మికులకు గిఫ్ట్‌లు అందజేయటం సంప్రదాయం, ప్రతీ ఏడాది జరుగుతున్న ఈ తంతును ఈ ఏడాది కూడా కొనసాగించాలని, అదేవిధంగా ఏరియాలోని కమ్యూనిటీ హాల్స్‌లో ఏసీలు ఏర్పాటుచేయాలని కోరారు. స్పందించిన జీఎం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.